RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 16 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ ఆదివారం 19-04-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి
R N I No. APTEL/2012/53127
The Voice of Telangana

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



## ప్రతిపక్షాలపై ప్రధాని

# తీవ్ర ఆగ్రహం

### విపక్షాలు తప్పు చేశాయ్.. పర్యవసానాలు తప్పవు

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ**

ఢిల్లీ: పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు తప్పు చేశాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నారీ శక్తి బిల్లును వ్యతిరేకించడం ద్వారా చారిత్రాత్మక తప్పిదం చేశాయని మోదీ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో దీనికి సంబంధించి ఆయా పార్టీలు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని తీవ్రంగా హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ తో లింకప్ చేసిన డీలిమిటేషన్ బిల్లు శుక్రవారం పార్లమెంటులో వీగిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భవిష్యత్తు కార్యచరణపై చర్చించేందుకు ప్రధాని మోదీ.. శనివారం దిల్లీలో కేబినేట్ భేటి నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్లును విపక్షాలు అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. బిల్లును అడ్డుకోవడం ద్వారా దేశంలోని మహిళలను ప్రతిపక్షాలు తీవ్ర నిరాశకు గురిచేశాయని ప్రధాని అన్నారు.



## బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్

# ఏర్పాటు

**కుమారస్వామికి విజ్ఞప్తి చేసిన సిఎం రేవంత్**

న్యూఢిల్లీ, : కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఉక్కు కొరత తగ్గడంతోపాటు.. పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం వివరించారు. పాత వాహనాల స్క్రాప్‌ను రీసైక్లింగ్ చేసే పరిశ్రమను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్‌ను కాలుష్యం లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో బిజీబిజీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా బయ్యారంలో గ్రీన్‌స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రోజన్ టెక్నాల జీతో గ్రీన్‌స్టీల్ క్లస్టర్ ఏర్పాటుకుప్రతిపాదన చేశారు. పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసై క్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పారిశ్రామిక విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు.

2వ పేజీలో...

**ప్రియాంకను కలిసి బిల్లును ఓడించినందుకు అభినందనలు**




### ఉక్కపోతను తట్టుకోలేక అల్లాడుతున్న జనం

హైదరాబాద్,: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగతో నిప్పుల కొలిమిలా మారుతోంది. జిల్లా ప్రజలు ఉష్ణ తాపానికి తట్టుకోలేక అల్లాడుతున్నారు. పది రోజులుగా అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాలోని అడవి దేవులపల్లిలో 43.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఉదయం తొమ్మిది గంటల నుంచే జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. రాత్రి పదైనా ఇండ్లు చల్లబడటం లేదు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండ్లల్లో ఉన్నా ఉక్కపోతను తట్టుకోలేపోతున్నారు. ఈ ఎండలు మే చివరి వరకు తీవ్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈసారి వానలు సరిగా లేకపోవడం కూడా ఉష్ణోగ్రత పెరుగుదలకు కారణమైంది.

## మహిళా బిల్లు పేరుతో..

# డీలిమిటేషన్ కుట్ర

చెన్నై,ఏప్రిల్18 : మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు..



**డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్**




## భూమి ఉన్నంతకాలం భూదాన్ పోచంపల్లి పేరు

# శాశ్వతం

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి




## డీలిమిటేషన్‌పై ప్రత్యామ్నాయ సూచనలు

# భేష్

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రియాంక గాంధీ అభినందనలు

**ప్రతిపక్ష ఐక్యతకు మద్దతుగా నిలిచినందుకు ప్రియాంక గాంధీకి సీఎం కృతజ్ఞతలు**

వరంగల్, ఏప్రిల్ 18,: హనుమకొండ జిల్లాలో గ్యాస్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు సామాన్య ప్రజలకు, చిరు వ్యాపారులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆన్లైన్ బుకింగ్ పేరుతో జాప్యం చేస్తూ.. మరోవైపు అధిక ధరలకు బ్లాక్లో సిలిండర్లను విక్రయిస్తూ ఏజెన్సీలు కాసుల వేటలో పడ్డాయనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఫలితంగా, దోపిడీ పర్వం యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వస్తున్నాయిగ్యాస్ కొరత కారణంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొంతకాలం గడువు విధిస్తూ ఆన్లైన్ బుకింగ్ విధానం వినియోగదారులకు సౌకర్యంగా ఉండాల్సింది పోయి, ఇబ్బందుల పాలయ్యేలా చేస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక సిలిండర్ బుక్ చేస్తే అది ఇంటికి చేరడానికి 20 రోజులకు పైగా సమయం పడుతోందని, దీనివల్ల సామాన్యులు కట్టెల పొయ్యి వైపు చూడాల్సిన పరిస్థితి తలెత్తుతుందని చెబుతున్నారు.




## గ్యాస్ ఏజెన్సీల

# దందా..!

# దక్షిణాదికి కాంగ్రెస్ చారిత్రక ద్రోహం..

**మహిళా బిల్లును అడ్డుకోవడంపై బండి సంజయ్ నిప్పులు**

హైదరాబాద్: లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకోవడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దేశ దక్షిణాది రాష్ట్రాలకు చారిత్రక ద్రోహం చేశాయని ఆయన ధ్వజమెత్తారు. వెలుపల "దక్షిణాది గౌరవం" అంటూ నినదించే విపక్షాలు, పార్లమెంటులో మాత్రం ఆ ప్రాంత ప్రయోజనాలను కాపాడే బిల్లును చంపేశాయని ఆయన విమర్శించారు. ఈ మేరకు శనివారం (ఏప్రిల్ 18, 2026) ఆయన 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు.



# గ్యాస్ ఏజెన్సీల దందా..!



మొదటిపేజీ తరువాయి...

వెంటనే ఈ ఆన్లైన్ విధానాన్ని పక్కన పెట్టి, పాత పద్ధతిలోనే ఇంటింటికీ సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని ఏజెన్సీలు, డెలివరీ బాయ్ లు అనుసరిస్తున్న కొత్త తరహా మోసం వినియోగదారులను విస్మయానికి గురిచేస్తోంది. గ్యాస్ పంపిణీ చేయకముందే వినియోగదారుల వద్ద నుంచి రకరకాల సాకులతో ఓటిపి లను సేకరిస్తున్నారు. సాఫ్ట్వేర్లో డెలివరీ అయినట్లు చూపిస్తూ.. ఆ సిలిండర్లను బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.వంట గ్యాస్ ధర అధికారికంగా రవాణా చార్జీలతో కలిపి 1000 ఉండగా, బ్లాక్లో రూ. 2 వేలకు విక్రయిస్తున్నారని, ఇక ఇదే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 1850 ఉండగా, ఏకంగా 3వేలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్యాస్ ధరల సెగ హోటల్ యజమానులకు, బజ్జీల బండి వ్యాపారులకు గట్టిగా తగులుతోంది. కమర్షియల్ గ్యాస్ ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరడంతో వ్యాపారాలు సాగించడం భారంగా మారింది. పోనీ కట్టెల పొయ్యి మీద వంట చేద్దామన్నా.. కట్టెల ధరలు కూడా వేలల్లో ఉండటంతో 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' చందంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నా, పౌరసరఫరాల శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్న గ్యాస్ ఏజెన్సీల గోదాములపై దాడులు నిర్వహించి, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గృహ, వాణిజ్య వినియోగదారులు కోరుతున్నారు.గ్యాస్ పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై సివిల్ సప్లై డిటి సదానందం స్పందిస్తూ.. వినియోగదారుల వద్ద నుంచి ముందస్తుగా ఓటిపిలు సేకరించడం, సిలిండర్లను బ్లాక్ మార్కెట్కు తరలించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు.

# భానుడి భగభగ!

మొదటిపేజీ తరువాయి...

ఉష్ణోగ్రతలు రోజురోజుకూ తీవ్ర స్థాయిలో పెరిగిపోతున్నాయి. భానుడు ఆరు రోజుల నుంచి తన ప్రతాపం చూపుతూన్నాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో నల్లగొండ నిప్పుల కుంపటిగా మారింది. ఈ వేసవిలో మొదటిసారి గరిష్ట ఉష్ణోగ్రత 40.0 డిగ్రీలకు చేరింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఉదయం 8.30 నుంచే వేడి గాలులు వీస్తున్నాయి. పది గంటల నుంచే రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం అయిదు గంటల వరకూ వేడిగాలులు తగ్గడం లేదు. తప్పని పరిస్థితుల్లోనే జనం బయటకు వస్తున్నారు. చిరు వ్యాపారులు రోడ్ల మీద అమ్ముకోలేని పరిస్థితి. ఎండలతో వ్యాపారం మందగించింది. కేవలం జ్యూస్ బండ్లు, కొబ్బరి బొండాలు, చల్లని పానీయాలకే గిరాకీ పెరిగింది. మరోపక్క విద్యుత్ కోతతో జనం ఉబ్బరింతకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్చి చివరి వారం నుంచి గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లాలో వడదెబ్బ మృతుల సంఖ్య గత సంవత్సరం కంటే పెరిగే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలతో పాటు వేడి గాలులు వీస్తుండటంతో భయానక పరిస్థితులు నెలకొన్నాయి.



వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా ఫిబ్రవరి నుంచి మే వరకు ఎండాకాలం ఉన్నప్పటికీ ఏప్రిల్ చివరిలో లేదా మేలో ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈసారి వర్షాభావ పరిస్థితుల కారణంగా నెల రోజుల ముందే ఎండల తీవ్రత మొదలైంది. పది రోజులుగా ఎండ ప్రభావం కారణంగా జనం బయటకు వెళ్లలేకపోతున్నారు.

విద్యా సంస్థలు మధ్యాహ్నం వరకు ఉంటుండగా, పిల్లలు ఇంటికొచ్చే సమయంలో చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. వారం రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలతోపాటు కనిష్ట ఉష్ణోగ్రతల్లో ఎలాంటి మార్పులు లేకుండా నమోదు అవుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 25 నుంచి 27 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. ఇప్పటి వరకు వడగాల్పుల ప్రారంభం కాకపోయినప్పటికీ ఎండలకు తోడు ఉక్కపోత ప్రారంభమైంది.

# ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలి

## ప్రజలకు డ్రైవర్స్ కు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సిపి సాయి చైతన్య



నిజామాబాద్ ఏప్రిల్ 18: (తెలంగాణ వాణి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఏప్రిల్ 13నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా శనివారం 6వ రోజు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ లకు సంబంధించినటువంటి ఎస్సైలు, సీ.ఐ లు, ఏ.సీ.పీ లు మరియు నిజామాబాద్ జిల్లా అదనపు డి.సి.పి (అడ్మిన్) పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఇందులో భాగముగా ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనీ మంగళ్ పహాడ్ చౌరస్తా వద్ద ప్రజలతో మరియు డ్రైవర్లతో అవగాహన కార్యక్రమం లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటేరోడ్డు ప్రమాదాలవల్లనే ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు ప్రతి ఒక్కరి ద్వారా రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం "అరైవ్ అలైవ్ " కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం , మద్యం సేవించి వాహనం నడపడం , డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలనుపాటించకపోవడం వంటి అంశాలేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని తెలియజేసారు. కోవిడ్ సమయంలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 200 మంది మృతిచెందగా 2025 లో జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల వలన 302 మంది తమ ప్రాణాలను కోల్పోయారని తెలియజేశారు. కావున రోడ్డు ప్రమాదాలు గణనీయంగా పెరిగి మరణాలు జరుగుతున్న కారణంగా ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కృషి చేయాలని ఇట్టి కృషి అనేది ప్రతి ఒక్కరీ,నుండి మొదలవ్వాలని తెలియజేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్ లో అట్టి ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని హాస్పిటల్ తరలిస్తారో , అతనికి ప్రభుత్వం నుంచి ప్రోత్సహించుట కోసం సహార్విర్ పథకం కింద ఉండేటటువంటి 25 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు తెలియజేసే పాంప్లెంట్లు మరియు పోస్టర్లను విడుదల చేసారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏ.సి.పి శ్రీనివాస్, బోధన్ రూరల్ సీ.ఐ విజయబాబు, ఎడపల్లి ఎస్సై రామ, బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి , రెంజల్ ఎస్సై చంద్రమోహన్ , మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది మరియు ప్రజలు/ఆర్టీసీ డ్రైవర్లు/ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలపై ప్రధాని తీవ్ర ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి...

ప్రతిపక్షాలు మహిళలకు దక్కాల్సిన హక్కులను అడ్డుకున్నాయనే సందేశాన్ని ప్రతి గ్రామానికి, ప్రతి వ్యక్తికి తీసుకెళ్లాలని తన మంత్రివర్గ సహచరులకు ప్రధాని సూచించారు. దేశంలోని మహిళలు బిల్లును వ్యతిరేకించిన పార్టీలను క్షమించరని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బిల్లును వ్యతిరేకించి విపక్షాలు తప్పుచేశాయని.. కోట్లాది మంది మహిళలకు వారు సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా మోదీ అన్నారు. రాబోయే రోజుల్లో శిక్ష అనుభవించక తప్పదని చెప్పుకొచ్చారు. మరోవైపు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో అడ్డుకోవడం ఘోరమని అన్నారు. బిల్లును అడ్డుకోవడమే కాకుండా పండుగ చేసుకోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఏ విధంగా ప్రజాస్వామ్యానికి విరుద్ధమో చెప్పాలని రాహుల్ గాంధీని నిలదీశారు. మరోవైపు మహిళల రిజర్వేషన్లకు తాము ఏమాత్రం వ్యతిరేకం కాదని విపక్షాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే మహిళా బిల్లు మాటున బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలు అస్పష్టంగా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లను లింకప్ చేస్తూ లోక్ సభలో కేంద్రం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ (131 రాజ్యాంగ సవరణ) బిల్లు వీగిపోయింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఎంపీలు.. ఈ బిల్లును వ్యతిరేకించడంతో 2/3వ వంతు మెజారిటీ రాక.. బిల్లు కార్యరూపం దాల్చలేదు. ఈ బిల్లు కోసం నిర్వహించిన ఓటింగ్ లో 528 ఎంపీలు పాల్గొనగా.. అందులో 298 మంది అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. సాధారణ మెజారిటీ లభించినప్పటికీ రాజ్యాంగపరమైన ప్రత్యేక మెజారిటీ నిబంధనను ప్రభుత్వం అందుకోలేకపోయింది.

# 7 రోజుల సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు నిర్వహించనున్న 7 రోజుల సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ విద్యార్థులకు సంబంధించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్యా విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. వసతి గృహాలలో అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి వసతులపై చర్చించాలని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు జిల్లాలో సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ గురుకులాలు, వసతి గృహాలలో వంటగది, పారిశుద్ధ్యం, మరమ్మత్తు పనులు చేపడతామని, విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించడంతో పాటు వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తామని తెలిపారు. రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ జనగణన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో తగిన ఏర్పాట్లు చేయవలసిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వయంగా ఆన్లైన్ నమోదు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకునే అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మే 11 నుండి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడనున్నందున అవసరమైన సాంకేతిక సదుపాయాలు కల్పించి, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు, గృహ నిర్మాణ శాఖ పిడి రవీంద్రనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# భూమి ఉన్నంతకాలం భూదాన్ పోచంపల్లి పేరు శాశ్వతం

మొదటిపేజీ తరువాయి...

భూదాన్ పోచంపల్లి : సమాజంలో సామాజిక న్యాయం, సమానత్వం సాధించడమే లక్ష్యంగా సాగిన భూదాన ఉద్యమానికి నాంది పలికిన భూదాన్ పోచంపల్లి గడ్డ భూమి ఉన్నంతవరకు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శనివారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో తెలంగాణ సర్వోదయమండలి, వెదిరే రామచంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో భూదాన ఉద్యమానికి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భూదానోద్యమం వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌటుప్పల్ చౌరస్తాలో ప్రథమ భూదాత వేదిరే రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16న శివరాంపల్లి నుండి ప్రారంభమైన సర్వోదయ పాదయాత్ర నేడు పోచంపల్లికి చేరుకుందన్నారు. రజాకారుల కాలంలో హింస మార్గంలో ప్రజలను చంపి భూమి గుంజుకుంటున్న సమయంలో అహింసా మార్గంలో 44 లక్షల ఎకరాల భూమిని సేకరించి పంచిపెట్టడం గొప్ప విషయమన్నారు. సర్వోదయ ఉద్యమంలో వెదిరే రామచంద్రారెడ్డి పాత్ర కీలకమని, ప్రపంచవ్యాప్తంగా పోచంపల్లికి గుర్తింపు ఉందన్నారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ భూదానోద్యమ స్ఫూర్తితోనే అప్పట్లో ఇందిరాగాంధీ సీలింగ్ యాక్ట్ తెచ్చారని, అప్పటి ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు సమర్థవంతంగా అమలు చేశారని గుర్తు చేశారు. పేదలకు భూమిని దానం చేయడం అనేది గొప్ప విషయమని ,అంతటి మహనీయుడి ఆవిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. పోచంపల్లికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని గతంలో ఇక్కడి నుండి నాగపూర్ వరకు సుమారు 500 కిలోమీటర్ల పైచిలుకు సర్వోదయ పాదయాత్ర చేపట్టామన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలు పడుతున్న బాధలను చూసి చలించిపోయిన వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమం తోనే భూదాన్ పోచంపల్లిగా పేరుందిందని ఆయన చేసిన సేవలను కొనియాడారు.

# దక్షిణాదికి కాంగ్రెస్ చారిత్రక ద్రోహం..

మొదటిపేజీ తరువాయి...

దక్షిణాది రాష్ట్రాలకు పొంచి ఉన్న ముప్పు..: 2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు తమ రాజకీయ ప్రాధాన్యతను కోల్పోయే ప్రమాదం ఉందని బండి సంజయ్ హెచ్చరించారు. జనాభాను నియంత్రించి, విద్య, అభివృద్ధిపై పెట్టుబడి పెట్టిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల గొంతు నొక్కేలా సీట్ల సర్దుబాటు జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముప్పు నుండి దక్షిణాదిని కాపాడేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఒక రక్షణ కవచంలా 131వ సవరణ బిల్లును తెచ్చిందని, కానీ విపక్షాలు దానిని అడ్డుకుని రాజకీయ స్వార్థాన్ని ప్రదర్శించాయని మండిపడ్డారు.

విపక్షాల ద్వంద్వ నీతిని ఎండగట్టిన మంత్రి..: కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్ లో స్పష్టమైన హామీఇచ్చారని, దక్షిణాది సీట్లను 50 శాతం పెంచేందుకు కూడా సిద్ధమని ప్రకటించినా విపక్షాలు మౌనంగా ఉండిపోయాయని బండి సంజయ్ గుర్తు చేశారు. మహిళలకు న్యాయం చేసే, భవిష్యత్ తరాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించే ఈ చారిత్రక సంస్కరణను అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ తన అసలు స్వరూపాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. ప్రధాని మోదీ ప్రతి ప్రాంతాన్ని రక్షించేందుకు కృషి చేస్తుంటే, విపక్షాలు కేవలం అధికారం కోసమే పాకులాడుతున్నాయని, ఈ ద్రోహాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ఆయన పేర్కొన్నారు.

# మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

మొదటిపేజీ తరువాయి...

అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు.బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు. భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని, కేంద్రంలో ప్రతి రాష్ట్రానికి మాట్లాడే అవకాశం, భాష, సంప్రదాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే వీలుండాలని అన్నారు. బీజేపీ పాలనా విధానం ఇందుకు భిన్నంగా ఉందని, ప్రధానమంత్రి ఒకే దేశం, ఒకే నేత, ఒకే భాష, ఒకే ప్రజ అంటూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం గుత్తాధిపత్యాన్ని తమ కూటమి అడ్డుకుంటుందని చెప్పారు. ఢిల్లీ నుంచి తమిళనాడును శాసించాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుకుంటున్నాయని రాహుల్ విమర్శించారు. అయితే ఇందుకు తాము ఎంతమాత్రం అనుమతించేది లేదన్నారు. తమిళనాడు తన భవిష్యత్తును తానే నిర్దేశించుకుంటుందని, తమిళ సంస్కృతి, హక్కులు, భాషా పరిరక్షణలో తాము ప్రజలకు బాసటగా ఉంటామని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# డీలిమిటేషన్‌పై ప్రత్యామ్నాయ సూచనలు భేష్

మొదటిపేజీ తరువాయి...

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 16: నియోజక వర్గాల పునర్విభజన ప్రతిపాదనలకు సంబంధించి బీజేపీ విధానంలో లోపాలను ప్రజల ముందుంచడంతో పాటు ప్రత్యామ్నాయ సూచనలు చేసి దక్షిణాది రాష్ట్రాల ఐక్యతకు కృషి చేసినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభినందించారు. ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కలిశారు. ఈ సందర్భంగా దక్షిణ భారత దేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలను బలహీనపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రజాస్వామ్య విరుద్ధ రాజ్యాంగ సవరణను అడ్డుకోవడం దేశ భవిష్యత్తును కాపాడేందుకు ప్రతిపక్ష శక్తులను ఏకతాటిపైకి తీసుకు రావడంలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు మద్దతుగా నిలిచినందుకు తెలంగాణ ప్రజల తరఫున ప్రియాంక గాంధీకి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఏక గ్రీవంగా ఆమోదం పొందిన మహిళా బిల్లుతో సంబంధం లేకుండా, మహిళా సాధికారత పేరుతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, అనవసరమైన డీలిమిటేషన్ అజెండాను ముందుకు తీసుకువచ్చారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ సీఎంతో అన్నారు.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి...

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటుకు విన్నవించారు. ఆటో, రక్షణ రంగాల ఉత్పత్తులు, రోబోటిక్స్ తయారీకి ప్రత్యేక పార్కుల కోసం ప్రతిపాదించారు ముఖ్యమంత్రి. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కేంద్రం సహకారం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అనుగుణంగా జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కుమారస్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

అలాగే వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివా రం ఉదయం సమావేశమయ్యారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు విషయాలను ప్రియాంక గాంధీ బయటపెట్టారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల తరఫున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ధన్యవాదాలు తెలియజేశారు. 'దక్షిణాది రాష్ట్రాలను ఏకీకృతం చేయడంలో నా కృషిని ప్రియాంక గాంధీ అభినందించారు' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# సంపాదకీయం

## విపక్షాల ఐక్యతను బలోపేతం చేసిన మోడీ !

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్దంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్ధంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటం పై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకో వాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

# కల్తీ పాలతో ఆరోగ్యము బేజారు..!



## కల్తీ పాలతో ఆరోగ్యానికి ముప్పు..!

పాలను అక్రమ మార్గంలో కల్తీ చేసే అవకతవకలను అరికట్టేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ పాల కల్తీ పెద్ద సమస్యగా మారింది.పాలకు డిమాండ్ పెరగడం మరియు సరఫరా అంతరం, పాలుపాడైపోయే స్వభావం వల్ల పాలు,పాల ఉత్పత్తుల ద్వారా నష్టం జరుగుతుంది.పాలు ఆరోగ్యానికి పోషకాహారం.చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు పాలు, టీ, కాఫీ తాగుతుంటారు.ఎముకల బలం కోసం చిన్న పిల్లలకు ఆ పాలును మరగించి ఇస్తాం.దీంతో, పాలకు మార్కెట్లో సూపర్ డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌ను ఆసరా చేసుకుని కల్తీ రాయుళ్లు రెచ్చిపోతున్నారు. రకరకాల బ్రాండ్ల పేరుతో తక్కువ ధరకే అమ్ముతున్నారు. పాలు తక్కువై, వాటిని వినియోగించు వారు ఎక్కువైనారు.దీన్ని అధిగమించడానికి వర్గీస్ కురియన్ అనేక సంస్కరణలు చేసి ఎన్నో అద్భుత విజయాలు సాధించారు.వర్గీస్ కురియన్ ఒక భారతీయ డెయిరీ ఇంజనీర్ మరియు సామాజిక వ్యవస్థాపకుడు.శ్వేత విప్లవం అని పిలవబడే భారతదేశంలో పాల ఉత్పత్తిలో విస్తృతమైన పెరుగుదలకు దోహదపడే కార్యక్రమాలకు ఆయన నాయకత్వం వహించారు.ఆయన 30 విశిష్ట సంస్థలను ముఖ్యంగా అమూల్ , జీసీఎమ్ఎమ్ఎఫ్,ఐ ఆర్ ఎమ్ ఏ, ఎన్ డి డి బి వంటివి స్థాపించి వాటిని రైతుల ద్వారా నిర్వహింపజేస్తూ అనేక మంది నిపుణులచే నడిపాడు.ఆయన గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ కు వ్యవస్థాపక చైర్మన్ గా యున్నపుడు అమూల్ బ్రాండ్ ఉత్పత్తిని సృష్టించి విజయం సాధించాడు.బర్రె పాలతో అమూల్ పాలపొడి తయారీ ఆవిష్కరణ విజయంతో ఆవు పాలతో కూడా పాలపొడి తయారీతో పాటు అనేక పాలఉత్పత్తులు తయారు చేయడం జరిగింది.భారతదేశ శ్వేత విప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 26 వ తేదిని జాతీయ పాల దినోత్సవంగా జరుపుకుంటాం.శ్రేష్ఠమయిన, బలవర్ధక ఆహారము పాలు.ఇందులో అన్ని రకాలైన పోషక విలువలు ఉన్నాయి.కొద్దిగా విటమిన్ సి, ఇనుము తక్కువ.అన్ని వయసులవారు తీసుకోదగ్గ ఉత్తమ ఆహార పదార్థము.ఆవులు,గేదెలు, మేకలు,గొర్రెల నుండి పాలను పొందవచ్చు.హిందువులు పవిత్రంగా పూజించే ఆవు యొక్క పాలు అన్ని రకాల పూజా కార్యక్రమాలలోను వాడతారు.ఆవు పాలలో 69 కిలో కేలరీలు, గేదె పాలలో 100 కిలో కేలరీలు, మేక పాలలో 66 కిలో కేలరీలు శక్తి ఉంటుంది.గతంలో గ్రామాల్లో ఏ ఇంట చూసినా పాడిగేదెల పోషణ ఉండేది.గ్రామీణ ప్రాంతాల్లో అప్పట్లో కొనేవారు తక్కువగా ఉండేవారు.ప్రతి ఇంటికి గేదె లేదా ఆవు ఉండేది.ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కూడా గేదెల పెంపకం తగ్గిపోవడంతో పాలకు కొరత ఏర్పడుతోంది.ఈ కొరత వల్ల పాల వ్యాపారం చేసేవారు కల్తీ పాలను తయారు చేసి బయట విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.మనమందరం తీసుకునే పాలు స్వచ్ఛమైనవా, కావా లేదా ప్రమాదకర రసాయనాలు లేనివని మనం ఖచ్చితంగా చెప్పలేనటువంటి పరిస్థితి.దేశం నలుమూలల నుండి ఎప్పటికప్పుడు పాల కల్తీకి సంబంధించిన అనేక వార్తలను మనం వింటున్నాము.కల్తీ పాల వల్ల ప్రజల ఆరోగ్యం మరియు పాలు మరియు దాని ఉత్పత్తుల యొక్క ప్రామాణికతను ప్రభావితం చూపుతుంది.పాలలోని డిటర్జెంట్లు, సింథటిక్ భాగాలు, యూరియా,కాస్టిక్ సోడా,ఫార్మాలిన్ వంటి కల్తీ పదార్థాలు ఎక్కువ కాలం తీసుకుంటే ఆరోగ్యంపై విపత్కర ప్రభావాలకు దారి తీస్తుంది,ఎందుకంటే ఇది ఫుడ్ పాయిజనింగ్,జీర్ణకోశ సమస్యలు, బలహీనతలు,గుండె సమస్యలు, క్యాన్సర్ లేదా వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది.మరి ముఖ్యంగా యూరియా, ఫార్మాలిన్,డిటర్జెంట్లు,అమ్మోనియం సల్ఫేట్, బోరిక్ యాసిడ్,కాస్టిక్ సోడా, బెంజోయిక్ యాసిడ్, సాలిసిలిక్ యాసిడ్,హైడ్రోజన్ పెరాక్సైడ్, చక్కెరలు మరియు మెలమైన్ వంటి వాటితో కల్తీ పాలు తయారు చేసి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు కల్తీ వ్యాపారులు.ఎస్ ఏన్ ఎఫ్ యొక్క అధిక సూచి ద్వారా,స్టార్ట్, అయోడిన్ పరీక్ష ద్వారా,పోటాషియం క్రోమేట్ మరియు సిల్వర్ నైట్రేట్ మిశ్రమాన్ని ఉపయోగించి,షుగర్ ఉనికిని పరీక్షించడానికి ఒక డయాసెట్రిక్ స్ట్రిప్ ను ఉపయోగించడం ద్వారా,మూలకాలు,విటమిన్ పరీక్షల ద్వారా పాలల్లో కల్తీ ని గుర్తించవచ్చు.ఇంట్లో ఫ్లాట్ బండపై రెండు చుక్కల పాలను వేయండి.అది ఏదో ఓవైపు పారుతుంది.పాలు పారిన వైపు తెల్లగా కనిపిస్తే అవి స్వచ్ఛమైనవి అని నిర్ధారించుకోవాలి.కల్తీ పాలు అయితే తెల్లగా కనిపించవు.మార్కెట్ లో దొరికే పీహెచ్ స్ట్రిప్‌తోనూ పాల కల్తీని కనిపెట్టవచ్చు.స్ట్రిప్ పై చుక్క పాలను వేయండి.పిహెచ్ రేషియో 6.4 - 6.6 మధ్యలో ఉంటే స్వచ్ఛమైన పాలని గుర్తించుకోవాలి.అంతకన్నా తక్కువ కానీ,ఎక్కువ ఉంటే పాలు కల్తీ పాలు జరుగుతుందని అర్థం.అయోడిన్ ద్రావణాన్ని కలపండి.ఇది బాగా మిక్స్ చేయండి.స్వచ్ఛమైన పాలు అయితే దాని రంగు లేత గోధుమ రంగులోకి మారిపోతుంది.అదే, కల్తీ పాలు అయితే దాని రంగు లైట్ చాక్లెట్ కలర్‌లోకి మారుతుంది.పాలలో గంజి లేదా ఏదైనా పిండి పదార్థం కలిపితే ఆ రంగు మాత్రం నీలంలో ఉంటుందని గుర్తించుకోవాలి.పాలను కల్తీ చేసేందుకు 100 లీటర్ల నీటిలో 5 కిలోల యూరియాను బాగా కలుపుతారు.దీంతో ఆ మిశ్రమం పాలలా తెల్లగా మారిపోతుంది.పాల వాసన వచ్చేందుకు కొన్ని కెమికల్స్ కూడా మిక్స్ చేస్తారు.ఇక,పాలలో యూరియా అవశేషాలు గుర్తించడానికి మార్కెట్‌లో యూరియాసే స్ట్రిప్స్ దొరుకుతాయి. వాటి మీద కొంచెం పాలు పోయాలి.అందులో గీతలు కనిపించాయంటే పాలు యూరియాతో తయారు చేశారని అర్థం.ఈ పాలు ఆరోగ్యానికి చాలా డేంజర్.ఇలా రకరకాల పరీక్షల ద్వారా కల్తీ పాలను గుర్తించవచ్చు.ఏది ఏమైనా కల్తీ పాలను అరికట్టాలి.అప్పుడే మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోగలుగుతాం.



- డాక్టర్ మోటె చిరంజీవి,
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

## చలివేంద్రం ఏర్పాటు చేసి మానవత్వం చాటిన దొనకొండ రమేష్




తుంగతుర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) వేసవి ఎండలు తీవ్రరూపం దాల్చిన వేళ ప్రజల దాహార్తిని తీర్చేందుకు తుంగతుర్తి మండల కేంద్రంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దొనకొండ రమేష్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుంగతుర్తి పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుండి వివిధ అవసరాల కోసం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, ప్రయాణికులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజూ చల్లని తాగునీరు అందుబాటులో ఉంచుతూ ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు.చలివేంద్రం వద్ద దాహం తీర్చుకున్న ప్రజలు స్పందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని, వేసవికాలంలో మరిన్ని చోట్ల కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం వలన ప్రజలకి దాహార్తి తీరుతుందని అన్నారు కార్యక్రమంలో దొనకొండ విష్ణు, సిహెచ్ రాములు, ఒగనగాని దశరథ, దాస్పెల్లి సతీష్, వర్ధిల్లి శ్రీకాంత్, నకిరేకంటి అయోధ్య, ప్రసన్న బాబు, యాకన్న, మేడిపల్లి రమేష్, మేడిపల్లి నవీన్, కుమ్మరి సోమయ్య, చింతకుంట్ల లోకేష్, పంది రమేష్, గుడిపాటి చందు, గుడిపాటి సైదులు, గుడిపాటి రాంబాబు, గుడిపాటి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష

### కూలీలకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి





జగిత్యాల: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ శనివారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంపుపై ప్రత్యేకంగా చర్చించారు. గ్రామాల్లో మరిన్ని కూలీలను ఉపాధి హామీ పనుల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పనుల అందుబాటును పెంచాలని ఆదేశించారు. పనుల ఎంపికలో పారదర్శకత పాటించాలని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు.పనుల ప్రగతిని రోజువారీగా పర్యవేక్షించాలని అన్నారు. కూలీల హాజరు నమోదు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మస్టర్ రోల్స్ లో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. కూలీలకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనుల తీరుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఉపాధి హామీ పనులలో మహిళలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ప్రతి పనిని ఫోటో క్యాప్చరింగ్ ద్వారా ఎన్ యం యం ఎస్ యాప్ లో నమోదు చేయాలని చెప్పారు. జియో ట్యాగింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. లక్ష్యాలను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని సూచించారు.ఉపాధి హామీ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. పనుల ప్రణాళికను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు.ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వేసవి కాలం అయినందున ఉపాధి హామీ పనులకు వచ్చే వారికి తగిన ఏర్పాట్లు చేయాలని, షేడ్ నెట్ లు తగిన నీడ, త్రాగు నీరు, ఓఅర్ఎస్, ప్రథమ చికిత్స మరియు తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీఓ నరసింహ రావు, డిఆర్డీఓ రఘువరన్,తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జగదీశ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## కాలి బూడిదైన మొక్కజొన్న పంటలు

నిర్మల్/కుంటాల (తెలంగాణ వాణి ప్రతినిధి): నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలోని వీట్టాపూర్ గ్రామంలో పలువురు రైతుల మొక్కజొన్న పంటలు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి.చేతికి వచ్చిన పంట కాలి బూడిద కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికే వానాకాలంలో అతివృష్టి కారణంగా నష్టాలను చవిచూసిన రైతులు,రబీ సీజన్‌లో గంపెడు ఆశలతో సాగు చేసిన పంట కూడా అగ్నిప్రమాదానికి గురవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బాధిత రైతు కుటుంబాలను మోహన్ రావు పటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లె మోహన్ రావు పటిల్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి తగిన పరిహారం అందించాలని కోరారు. సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగురం, గుండేటి నర్సయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## కొల్లూరులో విశేష నవనీత అలంకరణలో శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం



తెల్లాపూర్ (తెలంగాణ వాణి ప్రతినిధి): కొల్లూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రత్యేక సందర్భంగా స్వామివారిని నవనీత (వెన్న) అలంకరణతో శోభాయమానంగా అలంకరించగా, ఆ దివ్యరూపం భక్తులను ఎంతో ఆకట్టుకుంది.

ఈ విశేష అలంకరణలో స్వామివారి ముఖ కాంతి మరింత ప్రకాశవంతంగా కనిపించడంతో ఆలయానికి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెన్నతో చేసిన ఈ అలంకరణకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని ఆలయ పూజారులు తెలిపారు.ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రద్దీ పెరిగి, స్వామివారి దివ్య దర్శనం పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తి గీతాలతో మారుమోగింది. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ముఖ్య పాత్ర పోషించారు. భక్తులు స్వామివారి ఆశీస్సులతో సంతోషంగా తిరిగి వెళ్లారు.

# పిఠాపురానికి మహర్దశ




కాకినాడ : ఏపీ ప్రభుత్వం పిఠాపురం నియోజకవర్గానికి తీపికబురు చెప్పింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో పిఠాపురం మున్సిపాలిటీ హోదా సెలక్షన్ గ్రేడ్‌కు పెరిగింది.. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పిఠాపురం మున్సిపాలిటీకి సంబంధించి హోదా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదనలు పంపారు. మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలను పరిశీలించి సెలక్షన్ గ్రేడ్‌కు హోదా పెంచేందుకు ఆమోదం తెలిపారు. పిఠాపురానికి సెలక్షన్ గ్రేడ్ హోదా రావడంతో అదనపు నిధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గానికి ఏపీ ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పిఠాపురం మున్సిపాలిటీ ని సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పిఠాపురం మున్సిపాలిటీ కౌన్సిల్, స్పెషల్ ఆఫీసర్ చేసిన ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపించారు. పిఠాపురం మున్సిపాలిటీకి 2021 నుంచి 2025 వరకు వచ్చిన ఆదాయం, వ్యయం వివరాలను పరిశీలించారు. అనంతరం సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం తెలియజేయడంతో ఉత్తర్వులు జారీ అయ్యాయి. పిఠాపురానికి 1957లో మున్సిపాలిటీ హోదా వచ్చింది.. అయితే జనాభా ప్రాతిపదికన ప్రస్తుతం 30 వార్డులు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 55వేలమంది వరకు ఉండగా.. ఆ తర్వాత జనాభా సంఖ్య భారీగా పెరిగింది. అలాగే పిఠాపురం ఆధ్యాత్మిక క్షేత్రంగా ఉంది.. ఇక్కడ పాదగయ క్షేత్రం, కుక్కుటేశ్వరస్వామి, పదోశక్తి పీఠం పురుహూతిక అమ్మవారు, దత్తాత్రేయ స్వామి, స్వయంభూ శ్రీపాద వల్లభుడి ఆలయం, కుంతీమాధవస్వామి ఆలయాలు ఉన్నాయి. పిఠాపురంలోని ఆలయాలకు భక్తులు భారీగా తరలివస్తుంటారు.. దీంతో ఆదాయం కూడా పెరిగింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం మున్సిపాలిటీని సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు చొరవ తీసుకున్నారు. అధికారులు ప్రతిపాదనలు పంపగానే ఆమోదం తెలిపి సెలక్షన్ గ్రేడ్‌కు అప్‌గ్రేడ్ చేశారు. పిఠాపురం మున్సిపాలిటీ సెలక్షన్ గ్రేడ్‌గా అప్‌గ్రేడ్ కావడంతో.. త్వరలో ఇక్కడ గ్రూప్-1 అధికారిని కమిషనర్‌గా నియమించనున్నారు. హోదా పెరగడంతో మున్సిపాలిటీలో ఉద్యోగుల సంఖ్యను కూడా పెంచే అవకాశం ఉంది. ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు కూడా వచ్చే అవకాశం ఉంది. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు మంచి అవకాశం వస్తుంది. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం పిఠాపురం అభివృద్ధి కోసం పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.. తాజాగా పిఠాపురం మున్సిపాలిటీకి సెలక్షన్ గ్రేడ్‌గా మార్చారు. ఏదైనా మున్సిపాలిటీకి వార్షిక ఆదాయం రూ. 8 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే కనుక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తారు. మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలకు సంబంధించి వివరాలను పరిశీలించి ప్రభుత్వం హోదాను పెంచుతుంది. అంతేకాదు ఈ మున్సిపాలిటీలలో జనాభా ప్రాతిపదికన వార్డుల సంఖ్య 20 నుంచి 50 వరకు ఉండొచ్చు. ఏపీ ప్రభుత్వం ఇటీవల మున్సిపాలిటీల గ్రేడ్‌ను పెంచింది.. ఇప్పుడు పిఠాపురం మున్సిపాలిటీ గ్రేడ్ కూడా పెంచారు. అంతేకాదు ఠాపురం రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ల పథకం కిందకు తీసుకువచ్చింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన ప్రతిపాదనలకు రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. 37.25 కోట్ల రూపాయలతో పిఠాపురం రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు అన్నీ పూర్తి అయితే పిఠాపురం రైల్వే స్టేషన్ సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు కానుంది. మరోవైపు పవన్ కళ్యాణ్ పిఠాపురంలో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన సమయంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు అశుభ్రత, దుర్గంధంతో ఉండటాన్ని పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిసరాలను తక్షణం శుభ్రం చేయాలని అక్కడి అధికారులను ఆదేశించారు. అనంతరం ఈ ఏడాది జనవరి నెలలో ఢిల్లీ పర్యటనకు వెళ్లిన పవన్ కళ్యాణ్.. పర్యటనలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. ఈ క్రమంలోనే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమైన పవన్ కళ్యాణ్.. పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి అంశం గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణమైన పిఠాపురానికి సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుంటారని.. వారి సౌకర్యం కోసం పిఠాపురం రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద అభివృద్ధి చేయాలని రైల్వే మంత్రిని పవన్ కళ్యాణ్ కోరారు.

## చదువుతో వచ్చే కీర్తి స్థిరంగా నిలిచిపోతుంది

### మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్



హుజూర్ నగర్ (తెలంగాణ వాణి) చదువుకుంటే సమాజంలో విలువ పెరుగుతుంది చదువు ఉంటే సమాజం గుర్తిస్తుంది చదువుతో వచ్చే కీర్తి స్థిరంగా నిలబడుతుంది అదే. ధనంతో వచ్చే పదవులు తాత్కాలికంగా ఉంట యని పెద్దవాళ్ళు చెప్పిన రీతిగా హుజూర్ నగర్ పట్టణంలోనే 15వ వార్డుకు చెందిన పేద విద్యార్థిని .నిమిసికవి కీర్తన మహాత్మ జ్యోతిరావు పూలే జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది తల్లిదండ్రులు లేకపోయినా కసితో. కష్టపడి చదివి రాష్ట్రస్థాయిలో 440 గాను 436 మార్కులు సాధించి అందరిని అవురా. అనిపించింది 14 వ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు 15 వ వార్డు కౌన్సిలర్ నల్లగొండ సుజాత చంటి ఆధ్వర్యంలో మనసున్న మారాజు గా పేరుపొందిన దొంత గాని శ్రీనివాస్ గౌడ్ మున్సిపల్ చైర్మన్ 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని కీర్తనకు అందజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జురావు కోతి సంపత్ రెడ్డి మల్లయ్య శ్రీను ధనమ్మ సిలువ నాగలక్ష్మి సంధ్య సావిత్రి భద్రమ్మ ఉదయభాను వల్లపు దాసు కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## పల్లె దావఖానాలను పరిశీలించిన డిఎం అండ్ హెచ్ ఓ



కరీంనగర్:ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి) జిల్లాలోని చెల్పూర్, చల్లూరు, వీణవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు జమ్మికుంట-2 సబ్ సెంటర్ మరియు చల్లూరు పల్లె దావకానల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్శనలో హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టరు,ఎన్ సి డి రిజిస్టర్,ఫార్మసీ స్టోర్స్, పిల్లల వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్ ను దాని రోజువారి టెంపరేచర్ రికార్డుల నమోదును పరి శీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవుట్ పేషంట్లను పలకరి స్తూ వారికి అందుతు న్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ ను ఉద్దేశించి మాట్లాడుతూ పీహెచ్సీ డెలివరీ లను,మాతా శిశు ఆరోగ్య సేవలను ఇంప్రూవ్ చేయాలన్నారు, గర్భవతుల చెకప్స్,అభా కార్డుల క్రియేషన్ సంఖ్యను పెంచాలన్నారు 13 సం,,ల వయస్సు పైబడిన వారందరికీ ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపు లలో స్క్రీనింగ్ చేసిన అంద రిని రీస్క్రీనింగ్ చేస్తూ ఫాలో అప్ చేయాలన్నారు. ప్రసూతి గది పరిశుభ్రతలను పరిశీ లించి అందులో ఉండాల్సిన ప్రోటోకాల్ చార్టులను పరిశీ లించారు. అదేవిధంగా చెల్లూ రు సబ్ సెంటర్ కన్స్ట్రక్షన్ బిల్లింగ్ కూడా పరిశీలించి నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శ్రావణ్ కుమార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధి కారులు డాక్టర్ తులసి దాస్,డాక్టర్ సుచిత్ర మరియు సంబంధిత వైద్య సిబ్బంది ఉన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించండి

### తహసిల్దార్ కు ,పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు వినతి



జూలూరుపాడు: ఏప్రిల్ 18 ( తెలంగాణ వాణి ప్రతినిధి ):దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని మండల పరిధిలో ఉన్న పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈరోజు తాసిల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పాస్టర్స్ కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ ఇతర వర్గాలకు లేని మత పరిమితులు దళితులకు ఎందుకు,సుప్రీంకోర్టు తీర్పు పై ఆందోళన ,1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దుకు పిలుపు,దళిత క్రైస్తవులపై అమల్లో ఉన్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు తక్షణమే రద్దు చేయాలని, లేదా వాటి పరిధి నుండి దళితులను మినహాయించాలని పాస్టర్ వేపూరి నతానియల్ రాజ్ డిమాండ్ చేశారు. ఈ ఉత్తర్వులు దళితులకు మత స్వేచ్ఛపై రాజ్యాంగంలో ఆర్టికల్ 14 ,15, 25, లకు విరుద్ధమని వారు ఆవేదన వ్యక్తం చేశారు, దళితులు తమ ఇష్టానుసారంగా మతాన్ని ఎంచుకునే హక్కు కలిగి ఉండాలని అన్నారు, ఇతర వర్గాలైన ఓసి, బీసీ ఎస్టీలకు లేని మత పరిమితులు ఎస్సీలకు ఎందుకు విధిస్తున్నారు కేంద్ర ప్రభుత్వం స్పష్టంత ఇవ్వాలి, బౌద్ధం సిక్కు మతంలో మారిన దళితులకు ఎస్సీ హోదా కొనసాగుతుండగా క్రైస్తవ్యం మతంలోకి మారిన దళితులకు నిరాకరించడం వివక్షకు నిదర్శనమని విమర్శించారు, 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు పూర్తిగా అసమానతలను ప్రతిబింబిస్తున్నాయని వాటిని ప్రస్తుతం రాష్ట్రపతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు, చారిత్రాత్మకంగా దళితుల విద్యా ఆరోగ్యం పురోగతిలో క్రైస్తవ మిషనరీలు కీలక పాత్ర పోషించారని, ఆ నేపథ్యంలో మారిపిడి అయినా దళితులను శిక్షించేలా విధానాలు ఉండకూడదని అన్నారు, ఏ మతంలో ఉండాలన్నది వారి వ్యక్తిగత నిర్ణయం అని దానిపై ఎవరు ఆంక్షలు విధించే హక్కు లేదని స్పష్టం చేశారు, జ్యోతి రావు పూలే అంబేద్కర్ స్ఫూర్తితో మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో ఈ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ జూలూరుపాడు మండల అధ్యక్షుడు దెబ్బేందుల సాయికుమార్, మాజీ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ మాలోత్ కబీర్ దాస్, పాస్టర్ శ్రీకాంత్, పాస్టర్ ఇస్సాకు, పాస్టర్ తిమోతి, ఫాస్టర్ ఎలీషా, పాస్టర్ పౌలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశంలోమెరిసిన రచ్చపల్లి ఆణిముత్యం సాన్విక శ్రీ రీడింగ్ క్లిప్



ధర్మారం: ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి) పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎఫ్.ఎల్.ఎన్ సమీక్షా సమావేశంలో రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల లో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థిని గుర్రం సాన్విక శ్రీ రీడింగ్ కాంప్రహెన్షన్ వీడియోని కాన్ఫరెన్స్ హాల్ లో ప్లే చేసి చూపిస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన వాట్సాఫ్ గ్రూపుల్లో విద్యార్థులు ఇంటివద్ద రీడింగ్ రీడింగ్ కాంప్రహెన్షన్ చేసే వీడియోలు పోస్ట్ చేస్తున్నరన్నారు. ఈ విధంగా రచ్చపల్లి పాఠశాల పేరెంట్స్ వాట్సాఫ్ గ్రూపులో మూడవ తరగతి విద్యార్థిని గుర్రం సాన్విక శ్రీ ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ ను చదివి అర్థం చేసుకొని తన మాతృభాష అయిన తెలుగులో చక్కగా వివరించిందని తద్వారా తనకు ఆ పేరాగ్రాఫ్ ఎంత విపులంగా అర్థం అయిందో తెలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రచ్చపల్లి ప్రధానోపాధ్యాయులు సముద్రాల వంశీమోహనాచార్యులు, ఉపాధ్యాయులు సంపత్, లక్ష్మణ్ లను ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

## రోడ్ సేఫ్టీ పోటీల విజేతలకు జిల్లా కలెక్టర్ ప్రశంసలు..



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :జాతీయ రహదారి భద్రతా (రోడ్ సేఫ్టీ) మాసోత్సవాల సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. పోలీస్ శాఖ,రవాణా శాఖ ఆద్వర్యంలో ఈ ఏడాది జనవరి 1 వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు చేయించారు. అలాగే జిల్లాలోని పలు విద్యాసంస్థల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై వ్యాస రచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా, పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై కుటుంబ సభ్యులకు, సమీప ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్,వివిధ పాఠశాలల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే..



షాద్ నగర్: దివ్యాంగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శనివారం దివ్యాంగులకుఉచితంగా ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వ పాలన ప్రభుత్వం కొనసాగుతుందని అన్నారు. అనంతరం రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్యతో కలిసి దివ్యాంగులకు ఉచితంగా ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన మేయర్, డిప్యూటీ మేయర్

### పట్టు శాలువులతో సత్కరించిన ఆటో యూనియన్ నేతలు



కొత్తగూడెం (తెలంగాణ వాణి) కొత్తగూడెం పట్టణంలోని సూపర్ బజార్, రైల్వే స్టేషన్ ఆటో అడ్డా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి తీవ్రతలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు తాగునీటి అవసరం ఎక్కువగా ఉండటంతో పాటు ఆ ప్రాంత ప్రజలకు కూడా చలివేంద్రం అవసరం ఉందన్నారు. ఈ అవసరాన్ని గుర్తించి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అన్ని వర్గాలకు సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు మేయర్, డిప్యూటీ మేయర్ లను శాలువాలతో సత్కరించి పూల బొకే అందించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల దాహం తీర్చడం కోసం చేపట్టిన ఈ మంచి కార్యక్రమంపై వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు ,అడ్డ బాధ్యులు ప్రభాకర్ ,ప్రేమ్, పాషా, శ్రీను, రమేష్, వెంకటేశ్వర్లు, దుర్గ, వెంకట్ ,సర్వయ్య ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో సాయి జీనియస్ హై స్కూల్ కు ఉత్తమ పాఠశాల అవార్డు

### ప్రిన్సిపాల్ చౌకి సుధా రమేష్ కు గౌరవం




కోరుట్ల:ఏప్రిల్ 18 (తెలంగాణ వాణి) కోరుట్ల సాయి జీనియస్ హైస్కూల్ ప్రొఫైల్ పబ్లిషర్స్ ముంబాయి కరికులం సమర్థవంతంగా అమలు చేయడంలో జాతీయ స్థాయిలో ఉత్తమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఎంపికైన చౌకి సుధా రమేష్ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఈ పురస్కారాన్ని హైదరాబాద్ లోని నోవిటాల్ కన్వెన్షన్ లో బహూ కరించారు. వారి విశిష్ట నాయకత్వం, అంకిత భావం,విద్యా రంగంపై నిబద్ధతతో ఘనత సాధ్యమైందని విద్యా వర్గాలు ప్రశంసిస్తున్నాయి. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సాధన, నాణ్యమైన బోధన,సృజనా త్మక విద్యా అమలు ప్రశంసనీయం. ఈ సందర్భంగా సాయి జీనియస్ హైస్కూల్ కరెస్పాండెంట్ చౌకి సుధా రమేష్ మాట్లాడుతూ "ఇది మా పాఠశాలకు గర్వకారణం. ఈ ఘనతకు సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. సుధా రమేష్ మరిన్ని విజయాలు సాధిస్తాశీ అని ఆశిస్తున్నట్లు తెలిపారు. టీచింగ్,నాన్-టీచింగ్ సిబ్బంది కలిసి చౌకి సుధా రమేష్ అభినందిస్తూ సన్మానించారు.



### రామ్ చరణ్ సర్, నాకు మరో అవకాశం ఇవ్వండి..

# బుచ్చిబాబు స్పెషల్ రిక్వెస్ట్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం తన కొత్త సినిమా 'పెద్ది' షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాను బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదట ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేయాలని ప్లాన్ చేసినప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. కొత్త రిలీజ్ డేట్‌పై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. అయితే సినిమా ఔట్‌పుట్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకుంటున్నారని సమాచారం.

ఇటీవల రామ్ చరణ్ ఒక ప్రముఖ మ్యాగజైన్ కోసం చేసిన స్టైలిష్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ ఫోటోలపై స్పందిస్తూ డైరెక్టర్ బుచ్చిబాబు సానా "సార్... వన్ మోర్ ఛాన్స్ ప్లీజ్" అంటూ కామెంట్ చేయడం అభిమానులను ఆకట్టుకుంది. వీరిద్దరి మధ్య ఉన్న స్నేహం, అనుబంధం చూసి ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'పెద్ది' తర్వాత కూడా ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. అయితే దీనిపై అధికారిక సమాచారం మాత్రం ఇంకా బయటకు రాలేదు. ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ ఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఆయన సంగీతం ఈ సినిమాకు మరో పెద్ద ప్లస్ అవుతుందని భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా, ఈ సినిమాలో ఒక స్పెషల్ మాస్ సాంగ్ ఉండబోతుందనే వార్తలు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా బుచ్చిబాబు సినిమాల్లో పాటలకు మంచి ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా ప్రేక్షకులను ఆకట్టుకునే మాస్ పాటలు ఆయన స్టైల్. ఈ స్పెషల్ సాంగ్‌లో రామ్ చరణ్‌తో కలిసి ఎవరు డ్యాన్స్ చేస్తారు అనే విషయంపై చాలా రోజులుగా చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ అవకాశం మృణాల్ ఠాకూర్‌కి వచ్చినట్లు తెలుస్తోంది. 'సీతారామం', 'హాయ్ నాన్న' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మృణాల్, ఇప్పుడు మొదటిసారి మాస్ సాంగ్‌లో కనిపించబోతుందనే వార్తలు ఫ్యాన్స్‌లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఇటీవల ఆమె నటించిన మరో సినిమాపై రామ్ చరణ్ ప్రశంసలు కురిపించడం కూడా ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఇక ఏ ఆర్ రెహమాన్ అందించిన ఈ మాస్ ట్యూన్ థియేటర్లలో ప్రేక్షకులను ఉర్రూతలూగించేలా ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.




# విష్ణుప్రియ దారిలోనే మరికొందరు..





నటి, యాంకర్ విష్ణుప్రియ దారినే సెలబ్రిటీలు కొందరు ఫాలో అవుతున్నారు. రీసెంట్‌గా విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకర ఫోటోలను షేర్ చేస్తూ, సబ్‌స్క్రిప్షన్ పేరుతో డబ్బు వసూలు చేస్తున్నట్లుగా, విజయవాడకు చెందిన ఏఐఎస్ఎఫ్ నాయకులు కొందరు.. ఆమెపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. నటి, యాంకర్ విష్ణుప్రియ దారినే సెలబ్రిటీలు కొందరు ఫాలో అవుతున్నారు. రీసెంట్‌గా విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకర ఫోటోలను షేర్ చేస్తూ, సబ్‌స్క్రిప్షన్ పేరుతో డబ్బు వసూలు చేస్తున్నట్లుగా, విజయవాడకు చెందిన ఏఐఎస్ఎఫ్ నాయకులు కొందరు.. ఆమెపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విష్ణుప్రియ అసభ్యకర కంటెంట్‌తో జనాలను ఆకర్షిస్తూ, సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్‌తో భారీగా డబ్బు సంపాదిస్తుందని, సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వాళ్లకి ఎక్స్‌క్లూజివ్ క్లిప్స్ అంటూ, కుర్రాళ్లను తప్పుదోవ పట్టిస్తుందనేది వారి వాదన. ఒక్క విష్ణు ప్రియ మాత్రమే కాదు, సోషల్ మీడియాలో సెర్చ్ చేస్తే, ఇలాంటి వారు చాలామందే ఉన్నారు. అవకాశాలు లేక కొందరు, అవసరం కోసం కొందరు.. ఇలా,ఈ మధ్యకాలంలో ఇన్‌కమ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ బాటలో తెలుగు హీరోయిన్లు కూడా కొందరు నడిచేందుకు సిద్ధమవుతున్నట్లుగా సోషల్ మీడియాలో టాక్ నడుస్తోంది. సినిమా అవకాశాలు రాకపోతే ఏం చేస్తారు? తన టీమ్‌ని, ఫ్యామిలీని పోషించాలంటే మనీ అవసరం కాబట్టి.. ఇలాంటి పనులకు దిగుతున్నారని, ఇది వారికొక ఆదాయ మార్గంగా మారిందనేది, వీళ్లని ఫాలో అయ్యే వారి వాదన. ఎంత అవకాశాలు లేకపోతే మాత్రం.. ఇంతగా దిగజారాలా? అంతగా అయితే, ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పి, పెళ్లి చేసుకుని హాయిగా జీవితాన్ని అనుభవించక, ఎందుకు నిత్యం వార్తల్లో నిలవడం అంటూ.. ఇలాంటి వారికి కొందరు హితబోధ చేస్తున్నారు. నిజమే, అలా కూడా చేయవచ్చు కానీ, ఎవరికి ఎలాంటి అవసరాలు ఉన్నాయనేది? వాళ్లకి మాత్రమే తెలుసు. కాబట్టి పై నుంచి చూసి, జడ్జ్ చేయడం కూడా ఏమంత కరెక్ట్ కాదు. విష్ణుప్రియనే తీసుకుంటే.. ఈ వ్యవహారం బయటకు రాకముందు ఆమెకు ఉన్న ఫాలోయర్స్ కేవలం వందల్లోనే. కానీ, ఎప్పుడైతే కేసుల వరకు వెళ్లిందో.. సడెన్‌గా ఆమెను ఫాలో అయ్యే వారి సంఖ్య వేలకు మారింది. కొన్నిసార్లు ఇలాంటి కేసులు కూడా వారిని మరింత ఫేమస్ చేస్తాయనేది, విష్ణుప్రియ వ్యవహారంలో నిరూపితమైంది. ఇంతకు ముందు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ రూపంలో వీరికి అదనపు ఆదాయం లభించేది. ఇప్పుడది లేదు. అందుకే, సబ్‌స్క్రిప్షన్ పేరుతో వారి శరీరాన్నే ఆదాయంగా చేసుకోవాలని భావిస్తున్నారు. మరి ఎంతకాలం ఇది సాగుతుందో, పోలీసులు దీనిపై ఎలాంటి యాక్షన్ తీసుకుంటారనేది మాత్రం చూడాల్సి ఉంది.

# మే 1న జెట్లీ ఆగమనం..



కమెడియన్ సత్య హీరోగా నటిస్తున్న సినిమా 'జెట్లీ'. 'మత్తు వదలరా' ఫేమ్ రితేష్ రాణా దర్శకత్వంలో ఈ సినిమాను చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దామల్లు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ప్రెజెంటర్‌గా వ్యవహరిస్తోంది.

ఏప్రిల్ 30న రావాల్సిన రామ్ చరణ్ 'పెద్ది' సినిమా జూన్‌కు వాయిదా పడడంతో ఇప్పుడీ సినిమాను మే 1న విడుదల చేస్తున్నారు. అయితే మే 1వ తేదీన తరుణ్ భాస్కర్ 'గాయపడ్డ సింహం' సినిమా కూడా విడుదల కాబోతోంది. ఇక 'జెట్లీ' మూవీ విషయానికి వస్తే ఈ సినిమాతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా హీరోయిన్‌గా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుండి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్స్, ఫన్ గ్లింప్స్, సత్య ఈజ్ నాట్ జెట్లీ ప్రమోషనల్ సాంగ్‌కు మంచి స్పందన లభించింది.

తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్‌ను ప్రకటించడం విశేషం. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో సత్య, వెన్నెల కిశోర్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో డైనమిక్‌గా నడుస్తూ వస్తుండటం ఆకట్టుకుంటోంది. ఈ సినిమాకు కాలభైరవ సంగీతాన్ని అందించారు.

# 'హాయ్ నాన్న' దర్శకుడితో విజయ్ దేవరకొండ..




### క్రేజీగా అనౌన్స్‌మెంట్ పోస్టర్!

టాలీవుడ్ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ తన తదుపరి చిత్రాన్ని 'హాయ్ నాన్న' ఫేమ్ యువ దర్శకుడు శౌర్యువ్‌తో చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం కోసం ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులను రంగంలోకి దించుతున్నట్లు విజయ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ భారీ యాక్షన్ అడ్వెంచర్ కోసం హాలీవుడ్ విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు ఎరిక్ డర్ట్స్, అంతర్జాతీయ సినిమాటోగ్రాఫర్ అలెజాండ్రో మార్టినెజ్, ప్రముఖ ఎడిటర్ ప్రవీణ్ ఆంటోనీ, ఆర్ట్ డైరెక్టర్ సురేష్ సెల్వరాజన్ మరియు కాస్ట్యూమ్ డిజైనర్ సచిన్ లోవలేకర్ వంటి హేమాహేమీలు పనిచేయబోతున్నారు. 'ఖుషి' చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందించిన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు కూడా బాణీలు కడుతున్నాడు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ భావోద్వేగంగా స్పందిస్తూ, శౌర్యువ్ అద్భుతమైన ఊహాశక్తితో తెరకెక్కుతున్న ఈ సినిమా చాలా సవాల్‌తో కూడుకున్నదని, దీనికోసంతన శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శౌర్యువ్ మొదటి చిత్రం 'హాయ్ నాన్న' క్లాస్ మూవీగా గుర్తింపు పొందగా, ఈ కొత్త చిత్రం దానికి పూర్తి భిన్నంగా భారీ యాక్షన్ ఎపిసోడ్లతో గ్లోబల్ స్థాయిలో ఉండబోతోందని చిత్ర బృందం వెల్లడించింది. విజయ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ మరియు వైవిధ్యమైన పాత్రతో రూపొందుతున్న ఈ సినిమా ప్రకటన ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.

# సిద్ధార్థ్-అదితి ప్రేమకథ మరోసారి వైరల్

### పుట్టినరోజు శుభాకాంక్షలతో ఆకట్టుకున్న స్టార్ జంట





టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా నిలిచిన స్టార్ జంట సిద్ధార్థ్ – అదితి రావు హైదరి మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యారు. ప్రేమతో ప్రారంభమైన వీరి బంధం వివాహంతో మరింత బలపడగా, పెళ్లి తర్వాత కూడా ఈ జంట అన్యోన్యతతో అభిమానులను ఆకట్టుకుంటోంది. పెళ్లి తర్వాత వీరిద్దరూ తమ వ్యక్తిగత జీవితాన్ని ఎంతో హుందాగా, సంతోషంగా గడుపుతున్నారు. ముఖ్యంగా సిద్ధార్థ్ తన భార్య అదితిపై చూపించే ప్రేమ, గౌరవం తరచూ ప్రజల్లో చర్చకు దారి తీస్తోంది. పబ్లిక్ ఈవెంట్లు, ఇంటర్వ్యూలలో కూడా అదితి గురించి మాట్లాడటం ద్వారా ఆమెకు తన జీవితంలో ఉన్న ప్రాధాన్యతను వెల్లడిస్తున్నాడు. సిద్ధార్థ్ పుట్టినరోజు సందర్భంగా అదితి చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎంతో ప్రత్యేకంగా ఆయనను "మ్యానికార్న్" అంటూ పిలుస్తూ చేసిన శుభాకాంక్షలు అభిమానులను ఆకట్టుకున్నాయి. ఈ పిలుపు వెనుక వారి మధ్య ఉన్న ప్రత్యేక అనుబంధం, ప్రేమను ప్రతిబింబిస్తోందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అదితి తన పోస్ట్‌లో సిద్ధార్థ్‌ను సూర్యుడితో పోలుస్తూ, "నా జీవితానికి వెలుగు నీవే, నా నవ్వుల వెనుక కారణం నీవే" అంటూ భావోద్వేగంగా వర్ణించారు. ఆమె షేర్ చేసిన అందమైన ఫోటోలు ఈ జంట మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత స్పష్టంగా చూపించాయి. ఈ పోస్ట్ చూసిన అభిమానులు, సినీ ప్రముఖులు సిద్ధార్థ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ జంట ఇలాగే కలకాలం సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నారు. సంప్రదాయబద్ధంగా ఒక పురాతన ఆలయంలో వివాహం చేసుకున్న ఈ జంట, గ్లామర్ ప్రపంచానికి అతీతంగా నిజ జీవితంలోనూ ఆదర్శ దంపతులుగా నిలుస్తున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, గౌరవించుకుంటూ ముందుకు సాగుతున్న వీరి బంధం అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. కెరీర్ విషయానికి వస్తే, అదితి ప్రస్తుతం 'పరివారిక్ మనురంజన్', 'లయనెస్' వంటి హిందీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. మరోవైపు సిద్ధార్థ్ 'పరమ్ సుందరి' తర్వాత 'వివాన్ -- ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' సినిమాలో నటిస్తున్నారు. అయితే ఇటీవల ఆయనకు అవకాశాలు కొంత తగ్గినప్పటికీ, తనదైన శైలిలో మళ్లీ రీ-ఎంట్రీ ఇవ్వాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# రక్తదాతల సేవ స్ఫూర్తి అభినందనీయం

## జిల్లా కలెక్టర్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ దివాకర టిఎస్



ములుగు (తెలంగాణ వాణి): రక్తదానం చేయడం ద్వారా నిండు ప్రాణాలను కాపాడవచ్చని, రక్తదాతల సేవ స్ఫూర్తి ప్రశంసా నియమని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు శనివారం ములుగు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ -టి జి ఓ అసోసియేషన్, టీఎన్జీవో యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ములుగు గట్టమ్మ దేవాలయ సమీపంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మనం ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు ఒక నిండు ప్రాణాన్ని నిలబెడుతుందని,రక్తదానం అనేది కేవలం ఒక కార్యక్రమంగా చూడకూడదని,అది ఒక గొప్ప సామాజిక సంస్కృతిగా మారాలని ఉద్ఘాటించారు. జీవితాలను కాపాడే మహత్తర సేవలో భాగంగా ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తం అందుబాటులో ఉండడం అత్యవసర చికిత్సలలో ఎంతో కీలకమని,ముఖ్యంగా ప్రమాదాలు,శస్త్రచికిత్సలు,అత్యవసర వైద్య సేవల సమయంలో రక్తదానం ప్రాణదాతగా నిలుస్తుందని అన్నారు. జిల్లాలోని ప్రజలు,ఉద్యోగులు, ఉపాధ్యాయులు,యువత,పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

# బాల్య వివాహం ఎవరు ప్రోత్సహించవద్దు

## జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్



ఆదిలాబాద్, ఏప్రిల్ : 18 ( తెలంగాణ వాణి ప్రతినిధి ): బాల్య వివాహం ఎవరు ప్రోత్సహించవద్దని అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కానీ జరగకుండా ఉండడానికి అందరూ ప్రయత్నం చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ అక్షయ తృతీయలో అప్రమత్తంగా ఉండాలి ష్యూర్ ఎన్జీవో, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం బాల్ రక్షక్ భవన్ లో పూజారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ష్యూర్ ఎన్జీవో ముద్రించిన బాల్య వివాహాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీపీవో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... మంచి ముహూర్తాలు ఉన్నాయని వయసు చూడకుండానే పెళ్లి చేయడానికి ప్రయత్నం చేస్తా ఉంటారన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బాల్యవివాహాలు నిర్వహించొద్దని పూజారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. అర్చకులు చెప్తే ప్రతి ఒక్కరూ వింటారని ఈ విషయాన్ని దృష్టి ఉంచుకొని వయసు నిర్ధారణ చూసుకున్న తర్వాతే పెళ్లిళ్లు చేయాలన్నారు. ఆధార్ కార్డు వయసు ప్రామాణికం కాదని విద్య ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలన్నారు. తక్కువ వయసులో పెళ్లిళ్లు చేస్తే ఆరోగ్య సమస్యలతో పాటు, మానసిక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ సందర్భంగా ధూప దీప నైవేద్యా సంఘం జిల్లా అధ్యక్షుడు కలవరపు లింగయ్య మాట్లాడుతూ బాల్ వివాహ ముక్త్ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు నిరోధించడానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ సిపిఓ (చైల్డ్ మ్యారేజ్ నోడల్ ఆఫీసర్) రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్, పిఓఐసి ఎన్. స్వామి, ష్యూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్ కుమార్, అర్చక సంఘం ప్రచార కార్యదర్శి గజానంద్, కోశాధికారి నాగభూషణ్, చైల్డ్ హెల్ప్ లైన్, డిసిపియు, ష్యూర్ ఎన్జీవో సిబ్బంది తదితరులున్నారు

# నేడు బూర్గుపేట గ్రామంలో నేతకాని సభ

## జిల్లా నాయకులు దుర్గం బానయ్య నేతకాని, జాడి నరేష్ నేతకాని



ములుగు (తెలంగాణ వాణి): ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని బూర్గుపేటలో నేడు తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం జిల్లా మహాసభ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ములుగు జిల్లా ప్రజలు, నాయకులు అందరూ తప్పకుండా భారీగా తరలి వచ్చి ఈ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు దుర్గం బానయ్య నేతకాని, జాడి నరేష్ నేతకాని పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ సమయం సరిపోక నేతకాని సీనియర్ నాయకులకు,చాలా మంది ప్రజలకు తెలియజేయడంలో ఆలస్యం అవుతుందని, అందరూ అన్యత భావించకుండా తప్పకుండా ఈ పత్రిక ప్రకటన ద్వారా ఈ మహాసభకు తరలి రావాలని కోరారు. ఇటీవల విడుదల చేసిన కుల గణన వివరాల్లో మా కుల పేరు ప్రస్తావించకపోవడం పాలకుల పరాకాష్ఠ పాలనకు నిదర్శనం అని తక్షణమే నేతకాని కులస్థుల అసలు జనగణన ను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ కులాలలో అతి పెద్ద రెండవ కులం అయిన నేతకాని కుల గణన బయటపెడితే రిజర్వేషన్లు,రాజకీయ వాటాలు ఇవ్వబడుతుందనే కుట్రతో మా జనాభాను దాచి పెట్టారని,తక్షణమే మన కుల గణనను పూర్తి స్థాయిలో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర గెజిట్లో కూడా మా కుల పేరు లేకపోవడం బాధాకరమని,కేంద్ర గెజిట్ లో మా నేతకాని కుల పేరుని గెజిట్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో హక్కులు లేక మా కులస్థుల బ్రతుకులు ఆగమవుతున్నాయని,1/70 ,పిసా చట్టాలను పటిష్టం చేస్తూ మా కులస్తులకు ఏజెన్సీ ప్రాంత చట్టాలను వర్తింపజేయాలని లేదంటే మా కులస్తులను కొండకోయ నేతకాని పేరుతో ఎస్టీ కేటగిరి లో చేర్చాలని,మా కులస్థుల ఆర్థిక అభివృద్ధి కొరకు 1000 కోట్లతో ఏజెన్సీ నేతకాని అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇంకా ఈ మహా సభకు ముఖ్య అతిథితులుగా ఏజెన్సీ నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి ఈశ్వర్ నేతకాని, రాష్ట్ర నాయకులు ఏజెన్సీ నేతకాని సంఘం ముఖ్య నాయకులు,కుల ప్రజల బాగు కోసం నిరంతరం శ్రమిస్తున్న నేతకాని జన నాయకుడు జాడి శ్రీనివాసరావు నేతకాని ,యువ నాయకులు రామటేంకి బాబూరావు నేతకాని,కుమ్మరి వెంకటేశ్వర్లు నేతకాని నాయకులు ఇంకా రాష్ట్ర, జిల్లా, మండలాల సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

# ఆక్స్ఫర్డ్ పాఠశాలకు జాతీయ అవార్డు




నిజామాబాద్ ఏప్రిల్ 18: (తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లా కేంద్రం లోనీ స్థానిక ఎల్లమ్మ గుట్టలో గల ఆక్స్ఫర్డ్ హైస్కూల్ కు లీడ్ పాఠ్యాంశాలతో బోధనకు గాను ప్రత్యేక జాతీయ అవార్డు దక్కింది. హైదరాబాద్ లోగల నోవాటెల్ హోటలలో జరిగిన ఒక కార్యక్రమంలో లీడ్ సంస్థ సీఈవో సుమిత్ దొరా చేతుల మీదుగా పాఠశాల నిర్వాహకులు మామిడాల మోహన్ ఈ అవార్డు అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మామిడాలు మోహన్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లీడ్ పాఠ్యాంశాలు బోధిస్తున్న 9000 పాఠశాలలో తమ పాఠశాలకి జాతీయస్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డుతో పాటు ఉత్తమ కోఆర్డినేటర్, ఉత్తమ ప్రిన్సిపాల్ మరియు పాఠశాలలోని 15 మంది ఉపాధ్యాయ ఉపాధ్యాయినులకు కూడా శిక్షా అవార్డులు పొందడం ఆనందంగా ఉందని అన్నారు.గత ఐదేళ్లుగా పాఠశాలలో విద్యార్థుల ను తీర్చిదిద్దుతున్నందుకుగాను రాష్ట్ర స్థాయిలో 7 అవార్డులు, జాతీయ స్థాయిలో 5 అవార్డులు అందుకోవడం జరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రాథమిక స్థాయిలోనే ఉన్నతమైన విలువలతో కూడిన సంస్కారవంతమైన విద్యను అందించినట్లయితే తదనంతరం పిల్లల్లో మంచి ప్రతిభావంతులు తయారవుతారని తెలియజేస్తూ, విద్యార్థులు ప్రతిభను మార్కులతో కాకుండా వారి తెలివితేటల వృద్ధితో తో గమనించాలని అలాంటి వాతావరణం తమ పాఠశాలలో ఉంటుందని, ఈ రోజు పొందిన జాతీయ అవార్డు తమను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, విద్యార్థుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులకు అంకితం చేస్తున్నట్టు ఆయన తెలియజేశారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు నేరుగా గ్రామాల్లోకి వస్తా

**అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతాం**

**విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు కృషి -మంత్రి అడ్లూరి**

ధర్మారం (తెలంగాణ వాణి) ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నేరుగా గ్రామాల్లోకి వస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం ధర్మారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో రూ" కోటి 74 లక్షలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేయడంతో పాటు వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మారం మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ధర్మారం ప్రాంతంలోని విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో మండలంలోని ఎర్రగుంటపల్లిలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల పాఠశాలలో పదవ తరగతి వరకు అప్డేట్ చేశామని పదవ తరగతి వరకు మినీ గురుకుల పాఠశాలలలో సీట్లు 25శాతం ఇతర వర్గాలకు 75శాతం ట్రైబల్ విద్యార్థులకు కేటాయిస్తామని మంత్రి వివరించారు. ధర్మారం మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని యువత వివిధ రకాల క్రీడల్లో రాణించడానికి మినీ స్టేడియం ఉపయోగపడుతుందని మంత్రి అన్నారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. గ్రామ సమస్యలపై ప్రజలు ఎవరూ తన కొరకు హైదరాబాదు వంటి దూర ప్రాంతాలకు రావద్దని వారంలో మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఇప్పటికే జగిత్యాల జిల్లాలో ప్రభుత్వం తరఫున ఆరు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని అవసరమైన పక్షంలో ధర్మారం మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ కాలంలో రైతులను ఏనాడు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి నాయకత్వం ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో రైతులకు రాయితీ ద్వారా పనిముట్లు పంపిణీ చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ధర్మారం మండలంలోని 61 మంది రైతులకు రూ"18.24 లక్షల విలువైన వ్యవసాయ పరికరాలను ఈ సందర్భంగా మంత్రి అందించా రు. మండలంలోని 23 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను ఒకరికి షాదీ ముబా రక్ చెక్కుతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి కలెక్టర్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వేణు, ఏఎంసీ చైర్మన్ ఎల్ రూప్ల నాయక్, మాజీ ఎంపీపీ కొడారి హనుమయ్య, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, స్థానిక సర్పంచ్ దాగేటి రాజేశ్వరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సంఘ రాజకుమార్, నాయకులు దాగేటి ఉదయ్ యాదవ్, పాలకుర్తి రాజేశం గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలను అంతం చేద్దాం - ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తును అందిద్దాం



**బాల్య వివాహలకు వ్యతిరేకంగా గోడ పత్రిక ఆవిష్కరించిన జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని విద్యా చందన, జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లెనినా**

భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) ఎయిడ్ సంస్థ వారి ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వారి సౌజన్యంతో బాల్య వివాహాల నిర్మూలనకై గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది.బాల్య వివాహాల నిర్మూలనకై అందరూ నడుం బిగించాలని బాలల యొక్క భవిష్యత్తుకు ఎంతో కీలకంగా అని, బాల్య వివాహాలు అనేవి ఒక సామాజిక దురాచారం, అనదిగా కొనసాగుతున్నటువంటి ఈ సాంఘిక దురాచారాన్ని అందరం కలిసి సమూలంగా నిర్మూలించాలని బాల్య వివాహం అనేదే లేని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కై నిరంతరం శ్రమించాలని విద్యాచందన పిలుపునిచ్చారు. ఏప్రిల్ 19 అక్షయ తృతీయ సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను ఆమె చాంబర్లో ఆవిష్కరించారు.జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనునిత్యం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని బాలల పరిరక్షణ విభాగం ద్వారా బాలలకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు . చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల బాలికలకు శారీరక మానసిక ఆరోగ్య రుగ్మతలు వస్తాయని సరైన పరిపక్వత లేక పుట్టే పిల్లలు కూడా అనేక రకాల లోపాలతో పుట్టడం వల్ల జీవితాంతం ఆ మనోవేదన అనుభవించాల్సి వస్తుందని కొన్ని సందర్భాలలో మాత శిశు మరణాలు కూడా జరుగుతాయని ఈ నష్టాల వలన స్త్రీ పురుష నిష్పత్తి కూడా గణనీయంగా పడిపోతుందని జిల్లా సంక్షేమ అధికారిని ఆఫీసర్ స్వర్ణలత లెనినా తెలిపారు. ఈ కార్యక్రమంలో డి సమ్మక్క డిపిఎం, నర్మద డీపీఎం, అనురాధ ఏపిఎం ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి రాజేష్ కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్స్ మోహన్ , మాన్సింగ్,జ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు

# రైతులు పంటలు సాగు చేయొద్దు.. 4 గ్రామాల ఫార్మా రైతులకు కలెక్టర్ సూచన

యాచారం: నష్ట పరిహారం చెల్లించి ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములలో ఎలాంటి పంటలు సాగు చేయొద్దని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి, ఆదేశించారని ఆర్డీవో అనంతరెడ్డి, రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని నానక్ నగర్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి, గ్రామాలలోని ఫార్మాసిటీ కోసం సేకరించిన అసైన్డ్ భూములను ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నష్టపరిహారం చెల్లించి ఫార్మాసిటీ కోసం 14 వేల ఎకరాలకు పైగానే అసైన్డ్ భూములను సేకరించడం జరిగిందని వివరించారు. ఆ భూములలో రాబోవు వాన కాలంలో నాలుగు గ్రామాలలోని నష్టపరిహారం పొందిన రైతులు ఎవ్వరు కూడా పంటలు సాగు చేయొద్దన్నారు. కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అయ్యప్ప, పాల్గొన్నారు.

# బిఎంఎస్ సూచించిన సమస్యలకు స్టాండర్డ్ డైజేషన్ కమిటీ ఆమోదం

**12వ వేతన కమిటీని త్వరితగతిన ఏర్పాటుకు ఆమోదం**

**కోల్ ఇండియా కార్మిక వర్గం డ్రెస్ కోడ్ మార్పుకు అంగీకారం**

**స్టాండర్డ్ డైజేషన్ కమిటీ వివరాలను వెల్లడించిన బిఎంఎస్ నాయకులు**

కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి) కోల్ ఇండియాలోని బొగ్గు పరిశ్రమల్లో పనిచేసే కార్మిక వర్గానికి సంబంధించి బుధవారం జరిగిన స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సమావేశంలో బిఎంఎస్ సూచించిన సమస్యల ను పరిష్కరించేందుకు కమిటీ ఏకగ్రీవంగా అంగీకరించినట్లు ఆ సంఘం నాయకులు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ లో స్టాండర్డ్ డైజేషన్ కమిటీ 7వ సమావేశం నిర్వహించడం జరిగింది. ఆ సమావేశంలో బిఎంఎస్ తరఫున సుధీర్ గురుడే, సుజిత్ సింగ్, టీఎస్ పవన్ కుమార్లు ప్రతిపాదించిన అనేక సమస్యలను, ముఖ్య నిర్ణయాలను ఆమోదించడం జరిగిందని తెలిపారు. ప్రధానంగా సంస్థ తరఫున జేబీసీసీఐ 12వ వేతన కమిటీని త్వరితగతిన ఏర్పాటు చేయాలని చేసిన డిమాండ్ ను అంగీకరించడం జరిగింది. 2026 సంవత్సరానికి పురుషులకు "గ్రే "రంగు చొక్కా, "బ్లాక్" ప్యాంట్ యూనిఫామ్గా నిర్ణయించబడింది. అలాగే మహిళలకు "మెరూన్", బ్లాక్ రంగుల డ్రెస్ను ఆమోదించడం జరిగినట్లు తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం కొత్త ఎస్.ఓపి లో సవరణలు ప్రతిపాదించబడినట్లు తెలిపారు. ఉద్యోగి మరణించిన సమాచారం కంపెనీకి మూడు నెలలలోపు తెలియజేయడం తప్పనిసరి చేయాలని, అలాగే ఉద్యోగం కోసం దరఖాస్తును మూడు సంవత్సరాల లోపు సమర్పించడం కూడా తప్పనిసరి చేయాలని సూచించారు. డిపార్ట్మెంటల్ (ఇంటర్నల్) మహిళా భద్రతా సిబ్బంది (సెక్యూరిటీ గార్డులు) ఎంపికలో కనీస ఎత్తును 4 అడుగులు 8 అంగుళాలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగి డిపార్ట్మెంట్ అనుమతితో ఎలక్ట్రికల్ సూపర్వైజర్, మైనింగ్ సర్దార్, సర్వేయర్ వంటి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్లు సమర్పించినట్లయితే, వారికి ఒకేసారి రూ. 1, 00,000 ప్రోత్సాహకంగా చెల్లించి, తగిన పదవిలో నియమించే విధంగా నిర్ణయించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ స్పెషల్ లీవ్లో ఉన్న ఉద్యోగులకు, మెడికల్ అన్ఫిట్గా ప్రకటించే వరకు 100శాతం పూర్తి వేతనం చెల్లించాలని బి.ఎం.ఎస్ డిమాండ్ చేసింది. దీనిపై యాజమాన్యం సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందని ఆయూనియన్ వెల్లడించింది.ఐటిఐ అనంతరం రెండేళ్ల డిప్లొమా పూర్తి చేసిన ఉద్యోగులను కూడా డిపార్ట్మెంటల్ ప్రమోషన్ పరీక్షలకు అర్హులుగా పరిగణించాలని ప్రతిపాదించగా, దీనిపై యాజమాన్యం సానుకూలంగా స్పందించిం దని వెల్లడించింది. డిపార్ట్మెంటల్ ప్రమోషన్లలో ఆర్థిక ప్రయోజనాలు (ఇంక్రిమెంట్లు) కల్పించకపోవడంపై సంఘం ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తగిన ఆర్థిక ప్రయోజనం కల్పించాలని డిమాండ్ చేసింది. దీనిపై యాజమాన్యం 31 మే 2026లోపు సానుకూల నిర్ణయం తీసుకుంటా మని హామీ ఇచ్చిందని వివరించారు. కోల్ పరిశ్రమలో చిన్న సబ్-కాంట్రాక్టర్ల కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కార్పొరేట్ సాలరీ అకౌంట్



లేకపోవడం వల్ల ప్రమాదవశాత్తు మరణించిన సందర్భంలో రూ. 40 లక్షల బీమా లభించడంలేదని, అందువల్లఅందరికీ కార్పొరే ట్ సాలరీ అకౌంట్లు ప్రారంభించాలనే ప్రతిపాదనను సంఘం ఉంచగా, యాజమాన్యం త్వరలో అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు బి ఎం ఎస్ నేతలు వెల్లడించారు. ఉద్యోగుల తల్లిదండ్రులు పొందు తున్న పెన్షన్ను ఆదాయంగా పరిగణించకుండా, ప్రస్తుతం ఉన్న రూ. 10,000 పరిమితిని తొలగించివారికి మెడికల్ రిఫరల్ సౌకర్యం కల్పించాలని సంఘం డిమాండ్ చేసిందని తెలిపారు.దీనిపై కూడా యాజమాన్యంసానుకూలంగా స్పందించిందని బి ఎం ఎస్ నాయకులు పేర్కొన్నారు. సండే పబ్లిక్ హాలిడే రోజుల్లో డ్యూటీలోఉన్న ఉద్యోగుల హాజరు సాప్లో నమోదు కాకపోవడం వల్ల వేతనంలభించని సమస్య ను సంఘం ప్రస్తావించిందని,దీనిని యాజమాన్యం ఆమోదించి, సాప్ లో నమోదు అయినా లేకపోయినా మ్యాన్యువల్గా నమోదు చేసి వేతనం చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపినట్లు పేర్కొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com